ప్రజాశక్తి

మంగళవారం 7 జనవరి 2025

5

పార్వతీపురం మన్యం

వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాల్టీ పరిధిలో గల నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులకు విశాఖపట్నంలో గల నైపుణ్యాభివృద్ధి సంస్థలో ఎలక్ట్రీషియన్, టివి మెకానిక్, వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, ప్లంబింగ్, కార్పెంటర్, బార్బర్స్, బ్యూటీషన్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 8లోపు, మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు.

డీలర్ పోస్టుల భర్తీలో

జాప్యం వెనుక ఒత్తిళ్లు

- 15 రోజులైనా విడుదల కాని పరీక్షా ఫలితాలు
- ఎమ్మెల్యేల సిఫార్సుల వల్లే తాత్సారం?

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రేషన్ డీలర్ పోస్టుల భర్తీపై రాజకీయ మేఘాలు కమ్ముకున్నాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేల ఒత్తిళ్ల వల్లనే డీలర్ల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు సర్వత్రా చర్చ జరుగుతుంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సంబంధిత ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు అందజేయడంతో జిల్లా అధికారులపై ఒత్తిడి పెరిగింది. తాము సిఫార్సు చేసిన అభ్యర్థులకే డీలర్ పోస్టులు దక్కాలని అధికార పార్టీ ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. గత డిసెంబర్ 23న డీలర్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించారు. పార్వతీపరం, పాలకొండ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీ వాత్సవ్, యశ్వంత్ కుమార్ రెడ్డిల పర్యవేక్షణలో పరీక్షలు పకడ్బందీ ఏర్పాట్లు జరిగాయి. సబ్ కలెక్టర్ లిద్దరూ యువ ఐఎఎస్ అధికారులు కావడంతో పరీక్ష రాసిన ఆశావహులు ఆశలు పెంచుకున్నారు. పరీక్షలో ప్రతిభ ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక చేయనున్నట్లు అధికారులు ప్రకటించడంతో ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. పరీక్ష నిర్వహించి 15రోజులైనా ఫలితాలు విడుదల కాకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారపార్టీ ఎమ్మెల్యేల చుట్టూ కొంతమంది ఆశావహులు తిరుగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఒక్కో డీలర్ పోస్టుకు రెండు లక్షల రూపాయల వరకు రేటు పలుకుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్వతీపురం డివిజన్‌లో 36 రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు .285 మంది దరఖాస్తు చేసుకున్నారు. 63 మంది దరఖాస్తులను తిరస్కరించారు. 202 మంది పరీక్ష రాశారు. అలాగే పాలకొండ డివిజన్‌లో 20 డీలర్ పోస్టులకు 64 మంది పరీక్ష రాశారు. పాలకొండ డివిజన్ కన్నా పార్వతీపురం డివిజన్‌లో పోటీ ఎక్కువగా ఉంది. పరీక్ష రాసిన అభ్యర్థులు ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు.

డీలర్ల పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ (ఫైల్)

కలెక్టర్‌కు సిఫార్సు లేఖలు!

రేషన్ డీలర్ పోస్టులను తాము సిఫార్సు చేసిన అభ్యర్థులకే కేటాయించాలని కోరుతూ జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు లేఖలు అందజేసినట్లు చర్చ జరుగుతోంది. సబ్ కలెక్టర్ లిద్దరూ యువ ఐఎఎస్ అధికారులు కావడంతో సిఫార్సులకు ప్రాధాన్యత వుండబోదని భావించినా పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఎమ్మెల్యేల సిఫార్సు లకు పెద్ద పీట వేయడానికే పరీక్ష ఫలితాలు విడుదల చేయడంలో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన ఆరు నెలల్లో కస్తూరి బాయి పాఠశాలలు, మోడల్ స్కూల్స్ లో పనిచేసే అవుట్ సోర్సింగ్, డెయిలీ వేజ్ వర్కర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలను తొలగించడం, తాము సిఫార్సు చేసిన వ్యక్తులతో ఆ పోస్టులను భర్తీ చేయించుకోవడంలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు కృతకృత్యులయ్యారు. ఎమ్మెల్యేల ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు వారు చెప్పినట్లే చేసి చేతులు దులుపుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు రేషన్ డీలర్ పోస్టుల భర్తీ వ్యవహారం కూడా పారదర్శకంగా జరుగుతుందనే ఆశలు సన్నగిల్లిపోతు న్నాయి.

రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు

- జిల్లాకు 63 అంగన్వాడీ పోస్టులు
- మంత్రి సంధ్యారాణి వెల్లడి

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రంలోని గిరిజన నియోజకవర్గాల్లో గల రహదారుల అభివృద్ధికి కేంద్ర నిధులు రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కాశీపట్నంలో వంద రోజుల్లో 100 పనులు ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 35 రహదారి పనులు పూర్తి చేశామన్నారు. ఇంకా కొన్ని పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. గత ఆగస్టులో పంచాయతీల వారీగా ఆమోదించిన పనులు మంజూరు చేశామన్నారు. ఈ పనులను పూర్తి చేసుకోవాల్సిన బాధ్యత సర్పంచులు, ఎంపిటిసి సభ్యులపై ఉందని ఆమె అన్నారు. వైసిపి వారు పనులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మర్యాద ఇచ్చినంత వరకేనని అభివృద్ధిని అడ్డుకుంటే తాను ఏం చేయాలో అది చేసి చూపిస్తానని ఈ సందర్భంగా వైసిపి నాయకులకు ఆమె హెచ్చరించారు. ఇప్పటివరకు మక్కువలో బిటి రోడ్లకు రూ.10 కోట్లు మంజూరు చేశామని, ఇందులో ఒకటి మాత్రమే పూర్తయిందని, మిగిలిన పూర్తికాలేదన్నారు. పనులు ముందుకు జరగకుండా అడ్డుకుంటే సహించేది లేదని, అధికారులు ఎవరికీ భయపడొద్దని ఆమె అన్నారు.

మక్కువ మండలం కాశీపట్నంలో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

63 అంగన్వాడీ పోస్టులు మంజూరు

పార్వతీపురం మన్యం జిల్లాకు కొత్తగా 63 అంగన్వాడీ పోస్టులు మంజూరయ్యాయని మంత్రి సంధ్యారాణి తెలిపారు. ఇందులో 11 కొత్తగా మంజూరు కాగా, మిగిలినవి రిటైర్మెంట్ అయినవి, చనిపోయినవి ఖాళీలు ఏర్పడిన వాటిని భర్తీ చేయనున్నామన్నారు. తమ ప్రభుత్వం గత ప్రభుత్వ అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ వస్తుండడమే కాకుండా గతంలో ఒప్పందం కుదుర్చుకున్న విద్యుత్ ఛార్జీలను అమలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

భార్య అడిగితే అంత భవనం కట్టిస్తారా...

మనకు తెలిసినంతవరకు ఎవరైనా భార్యకు ఏదో చిన్న చిన్న వస్తువులు కొనివ్వడం మనం చూస్తూ ఉంటామని, కానీ ఓ ప్రబుద్ధుడు ఏకంగా భార్య కోసం వేలకోట్ల రూపాయలతో భవనం నిర్మించాడని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై మంత్రి సంధ్యారాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో తన భార్య అడిగిందని విశాఖలోని రుషికొండనే గుండుగా చేసి రూ.5వేల కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి విశాలమైన భగవంతుని నిర్మించారని ఆమె ఆరోపించారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది కాబట్టి ఆ విషయం బయటపడిందన్నారు. 11 సీట్లు ఉన్న వ్యక్తి ప్రతిపక్షం కావాలని అడగడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్షానికి ఎన్ని సీట్లు రావాలో ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు. ప్రజలే ప్రతిపక్షం పాత్ర ఇవ్వలేదని ఆమె ఎద్దేవా చేశారు.

గుడ్లు కాంట్రాక్టర్ రద్దు చేస్తాం

స్థానిక కెజిబివి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని మంత్రి సంధ్యారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ పంపిణీ చేస్తున్న కోడిగుడ్లను చూసి ఇంత చిన్న గుడ్లు ఎవరు సరఫరా చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారానికి సంబంధించిన గుడ్లు ఇంత చిన్నవి సరఫరా చేయడమేమిటని ప్రశ్నించారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను రద్దు చేసి మరో కాంట్రాక్టర్‌కు అప్పచెబుతామని అన్నారు. అంతకుముందు పాఠశాల విద్యార్థులతో ఆమె మమేకమయ్యారు. ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా పాఠశాల సిబ్బంది కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, పంచాయితీ రాజ్ డిఇ చిన్నారావు, మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాలరావు, స్థానిక ఎంపీటీసీ కోట జయ, తదితరులు పాల్గొన్నారు.

డోలి మోతలు ఉండకూడదు

సాలూరురూరల్ : గిరిజన ప్రాంతాల్లో డోలి మోతలు ఉండకూడదని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు గుమ్మడి సంధ్యా రాణి అన్నారు. మండలంలోని తోణాం పంచాయతీలో రూ.6లక్షలతో స్థానిక తంగుడు గోవిందరాజు ఇంటి నుంచి వారణాశి చినమల్లేశ్వరరావు ఇంటి వరకు నిర్మించిన సిసి రోడ్డును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలో 52 రోడ్ల నిర్మాణంలో కొన్ని త్వరలో పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. 18 రోడ్ల నిర్మాణానికి రూ: 54 లక్షలతో నిర్మించామన్నారు. పాచిపెంటలో 27 రోడ్ల నిర్మాణం పూర్తయ్యిందని, మక్కువ మండలంలో 35, మెంటాడ మండలంలో 22 రోడ్ల నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. జనసేన నాయకులు మెట్టవలస గ్రామానికి స్కూల్ కావాలని మంత్రిని కోరగా, వారం పది రోజుల్లో స్కూల్ నిర్మాణం పనులు మొదలు పెడతామని మంత్రి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఎక్కడా స్కూల్ లేని గ్రామం ఉండకుండా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామానికి తాగు నీరుకి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాబోయే సంవత్సరంలోగా ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని మంత్రి వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ పార్వతి, పంచాయతీ రాజ్ శాఖ డిఇ చిన్నారావు, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, స్థానిక నాయకులు రొంపల్లి వెంకటేష్, రజిని, సుర్ల రాము, భాస్కరరావు, బూస తవుడు, డొంక అన్నపూర్ణ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో తంటాపల్లిలో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన సుడా చైర్మన్ కొరికాన రవిని పలువురు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధికి తన తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ హయాంలో పాలకొండ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, మండల టిడిపి నాయకులు జాడ శ్రీధర్, జనసేన నాయకులు వైసిపి వైస్ ఎంపిపి అనిల్ కుమార్, కొరికాన గంగనాయుడు తదితరులు ఉన్నారు.

స్వరూపకు డాక్టరేట్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న జెట్టి స్వరూప పిహెచ్‌డి పట్టా పొందారు. ఆమె అండర్ స్టాండింగ్ లైఫ్ ఇన్సూరెన్స్ బయ్యర్ డెసిషన్ ఎ కేర్ స్టడీ ఆఫ్ కోస్టల్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అన్న అంశంపై స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి పిహెచ్‌డి పట్టా పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీవరం స్వరూపను అభినందించారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, ఆయకట్టు రైతులు

లిఫ్ట్ ఇరిగేషన్‌కు విద్యుత్తు సౌకర్యం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం

మక్కువ మండలంలోని చెక్కవలస వద్ద 1990లో లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంపెట్టారని, దీనికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గిరిజనులతో కలిసి కలక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెక్కవలసలో గిరిజనుల భూములకు 300 ఎకరాలకు సాగు నీరందించడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించిన వెంటనే కాలిపోయినా ఇంత వరకు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగు నీటి ప్రాజెక్టులకు వేల కోట్లు రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం గిరిజనులకు 300 ఎకరాలకు సాగు నీరందించే లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిర్లక్ష్యం చేయడమంటే గిరిజనులపై ప్రేమ ఎంత వుందో అర్థమవుతుందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి చెక్కవలస లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు విద్యుట్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసి గిరిజనులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్‌లో గిరిజనులను కదిలించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయుకులు టి.ప్రభాకర్, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు. అనంతరం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవకు వినతి పత్రం అందజేయగా, ఇందుకు ఆయన స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పిజిఆర్ఎస్‌కు 121అర్జీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమానికి 121 వినతులు అందాయి. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి భాగస్వాములై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేసి, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇవ్వాలని, అర్జీలను ఆడిటింగ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కార ప్రగతిపై ప్రతివారం సమీక్షిస్తామని, అర్జీలు రీ ఓపెన్ కాకుండా సరైన కారణాలను అర్జీదారునికి వివరించాలన్నారు. స్వీకరించిన వినతుల్లో కొన్ని...

గుమ్మలక్ష్మీపురం మండలం జోగిపురానికి ఉపాధిహామీ చట్టం ద్వారా వేసిన మట్టి రోడ్డు పూర్తిగా పాడైనందున రోగులను ఆసుపత్రికి డోలీల్లో తీసుకువెళ్లాల్సి వస్తుందన్నారు. కావున డొంగరకిక్కువ నుంచి జోగిపురం వరకు తారురోడ్డు మంజూరు చేయాలని జె.శ్రీనివాస్, గ్రామస్తులు వినతిని అందజేశారు. కురుపాం మండలం బొడ్డిగాడిగూడకి సరైన రోడ్డు సౌకర్యం లేనందున గ్రామంలోని ప్రజలు, గర్భిణీలు ఇబ్బంది పడుతున్నారని, కావున రాయుడుగూడ నుంచి బొడ్డిగాడిగూడ వరకు రోడ్డు నిర్మించాలని ఆ గ్రామ సర్పంచ్ బి.కుసుమ కోరారు. పాచిపెంట మండలం చింతలవలసలో 25 కుటుంబాలు నివసిస్తున్నాయని, ఆ గ్రామానికి ఆశా వర్కర్ లేనందున చిన్న పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు అనారోగ్యపరంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని, కావున తమ గ్రామానికి ఆశా వర్కర్‌ను ప్రభుత్వం నియమించాలని గ్రామస్తులు కోరారు. గరుగుబిల్లి మండలం ఉల్లిభద్రలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో గ్రామస్తులు ఉపాధి హామీ పనికి వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని, కావున తమ గ్రామానికి కొత్త క్షేత్ర సహాయకులను నియమించాలని ఉల్లిభద్ర గ్రామ ప్రజలు వినతి పత్రాన్ని అందించారు. అలాగే ఉల్లిభద్ర సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ టి.వాసవికుమారి మూడేళ్లుగా డిప్యూటేషన్‌పై ఇఇ పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్నందున తమకు అందుబాటులో లేరని, గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డిప్యూటేషన్ రద్దు చేసి, తమ సచివాలయంలో కొనసాగించాలని ఎం.తవిటినాయుడు అర్జీని అందజేశారు. పార్వతీపురం మండలం డోకిశీల, గోచక్క, డి.కె.పట్నంలోని గిరిజన గ్రామాల మహిళా సంఘాల సభ్యులు విడివికెల ద్వారా కుట్టుమిషన్ల శిక్షణ పొందామని, కావున తమకు ఉపాధి నిమిత్తం కుట్టుమిషన్లు మంజూరు చేయాలని వి.కష్ణవేణి, తదితరులు దరఖాస్తు అందజేశారు. సీతానగరం మండలం సుభద్ర సీతారాంపురం గ్రామానికి చెందిన దాసరి సూరమ్మ వినతి పత్రాన్ని అందిస్తూ తనకు వితంతు పింఛను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

భూసార పరీక్షల కిట్లు అందజేత

పిజిఆర్ఎస్ కార్యాక్రమం అనంతరం భూసార పరీక్షల కిట్లను మండల వ్యవసాయ అధికారులకు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్ఒ కె.హేమలత అందజేశారు. అలాగే బధిరులకు (డి.రవీంద్ర, బి.పారయ్య) టచ్ ఫోన్లను అందజేశారు.

వ్యవసాయాధికారులకు భూసార పరీక్ష కిట్లను అందజేస్తున్న కలెక్టర్

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

రక్తదాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పిలుపు

ప్రజాశక్తి - పాలకొండ

జిల్లాలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని, తద్వారా ప్రాణదాతలు కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత అపోహాలు మాని రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో బ్లడ్ సెంటర్లో రక్తదాన శిబిరాన్ని సోమవారం రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని రక్తదాతలకు అభినందనలు తెలిపి, సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరతను అధిగమించేందుకు మేము సైతం కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఎనీమియా, తలసేమియా, సికిల్‌సెల్ వంటి సమస్యలు ఉన్నాయని, వీటితో పాటు అత్యవసర సమయాల్లో రక్తాన్ని అందించేందుకు సరిపడా నిల్వలు లేవని అన్నారు. జిల్లాలో రక్త కొరత తీరాలంటే అపోహాలు విడనాడి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదాన కార్యక్రమంలో పురుషులతో పాటు మహిళలు పాల్గొనడం ఆనందంగా ఉందని, ఇదే స్ఫూర్తితో ఆరోగ్యవంతు లైన ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చని తెలిపారు. అనంతరం రక్తదాతలకు కలెక్టర్ ప్రసంశా పత్రాలు అందజేశారు. అనంతరం అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ బ్లడ్‌బ్యాంక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొని వస్తే పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నో ఏళ్ల నుంచి అవసరమైన బ్లడ్ బ్యాంక్ కూటమి ప్రభుత్వం హయాంలో ప్రారంభం అవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్థక శాఖాది .కారి డాక్టర్ ఎస్.మన్మధరావు, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయ పార్వతి, ఆసు పత్రి వైద్యులు శివప్రసాద్, చిరంజీవి, రవీంద్ర, నాగ శివజ్యోతి, భారతి, ప్రసన్న లక్ష్మి, రెడ్ క్రాస్ ప్రతినిధి పి.చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా రక్తదాతను అభినందిస్తున్న కలెక్టర్

అటవీ, బంజరు భూములకు పట్టాలిప్పించండి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ, బంజరు భూములకు పట్టాలిస్తామని గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గేమ్మెల జానకీరావు, వంతల సుందరరావు మాట్లాడుతూ సర్వేలు చేసి అనేక ఏళ్లు గడుస్తున్నా నేటికీ పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. వీటి కోసం గతంలో అనేక ఆందోళనలు కూడా చేపట్టామన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జిల్లేడువలస, బొర్ర పనుకువలస గిరిజనులకు పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని, కానీ వాటిని నేటికీ అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తర్వాత గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తానని, గతంలో సర్వేలు చేసే వారందరికీ పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

మంత్రిని కలిసిన వారిలో వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి, జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివసరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గెమ్మెల వంశీ, శ్రీను, రాము, కూనేటి చినబాబు పొట్టంగి రాము తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సంధ్యారాణికి వినతిని అందజేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

అన్నా క్యాంటీన్‌కు స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

అన్న క్యాంటీన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

అన్న క్యాంటీన్ నిర్మాణానికి స్థానిక ఎంపిడిఒ కార్యాలయం, కోర్టు సమీపంలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అన్న క్యాంటీన్ ద్వారా అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. శాశ్వతంగా అన్న క్యాంటీన్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఇఒపిఆర్‌డి జె.రమేష్ బాబు, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టిడిపి యువ నాయకులు చందక రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన పీసా ఉపాధ్యక్షులు, కార్యదర్శి

ప్రశాంతంగా పీసా ఎన్నికలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయితీలో సోమవారం సర్పంచ్ ఎ.మన్మధరావు ఆధ్వర్యంలో ధర్మలక్ష్మీపురం, చింతమాను గూడ పీసా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ధర్మలక్ష్మీపురం పీసా ఉపాధ్యక్షులుగా బిడ్డిక రామారావు, చింతమానుగూడ ఉపాధ్యక్షులుగా బిడ్డికి విజయను గిరిజన ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం గిరిజనులకు అందుబాటులో ఉండి వారి హక్కుల సాధన కోసం పాటుపడతామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న ఉమా జ్యోతి

రక్తహీనతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తహీనతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం హోమ్ సైన్స్ అధికారి ఉమాజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థుల్లో రక్తహీనత రావడానికి గల కారణాలను వివరించారు. పోషకాహారం, ప్రకృతి వ్యవసాయ ద్వారా పండించే కూరగాయలను, గుడ్లు, పాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీవరం, వైస్ ప్రిన్సిపల్ రామయ్య, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ నిర్వాహకులు శ్రీవాణి, ఎన్ఎస్ఎస్ సిబ్బంది ఉన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన ఆహ్వానం మేరకు వేణుగోపాలస్వామి పూజ కార్యక్రమంలో సోమవారం ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ మేరకు బొబ్బిలి కోటలో జరిగిన పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గం అభివృద్ధి పదంలో నడవాలని, ఈ కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీ నాయన ,టిడిపి నాయకులు సుజయ్‌కృష్ణ రంగారావు, కోలా రంజిత్‌కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎపిఒ చినబాబు

సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - సీతంపేట

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు గిరిజనులు గ్రీవెన్స్‌లో వినతులు సమర్పించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక సోమవారం ఐటిడిఎ ఎపిఒ చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ గ్రీవెన్స్ 22 వినతులు వచ్చాయి. వీటిలో... బడుగూడకు చెందిన రాజయ్య ఇల్లు మంజూరు చేయాలని విన్నవించారు. ఎస్‌జె పురానికి చెందిన వీరయ్య వ్యవసాయ బోరు మంజూరు చేయాలని, బలదగూడ చెందిన రుషి మిత్ర మినీ అంగన్వాడీ పోస్టు మంజూరు చేయాలని, ఎలమంచిలికి చెందిన మల్లేశ్వరరావు ట్రాక్టర్‌లోను ఇప్పించాలని విన్నవించారు. శోభనాపురానికి చెందిన లక్ష్మణరావు ఆయిల్ ఇంజన్ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో డిడి అన్నదొర, డిప్యూటీ ఇఒ రవి ప్రసన్నకుమార్, డిఇ గోపాలకృష్ణమూర్తి, సిడిపిఒ రంగలక్ష్మి, పిహెచ్ఒ ఎస్‌వి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చెముడులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని చెముడు గ్రామ సచివాలయ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. స్థానిక సర్పంచ్ బొంగు రాజేశ్వరి ఆదేశాలతో కార్యదర్శి దుర్గాప్రసాద్ దగ్గరుండి పారిశుధ్య పనులు చేపడుతున్నారు. సంక్రాంతి, శంబర జాతర జరగనున్న నేపథ్యంలో గ్రామంలో భక్తులు, బంధువులతో రద్దీ పెరిగే ఆస్కారం ఉందన్నారు. ఇప్పటికే పేరుకుపోయిన చెత్తను కాలువ నుంచి తొలగిస్తున్నారు .

కాలువలో పూడికలు తీయిస్తున్న సర్పంచ్ రాజేశ్వరి

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కురుపాం

రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహశీల్దార్ ఎం.రవణమ్మ కోరారు. సోమవారం మండలంలోని కిచ్చాడలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ముటేషన్లు, పేర్లు మార్పిడి తదితర భూ సమస్యలతో బాధపడుతున్న రైతులు వినతి పత్రాలు అందిస్తే పది రోజుల్లో వారి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వీరఘట్టం: భూ రీసర్వే కార్యక్రమంలో ఎలాంటి అభ్యంతరాలున్నా తమ దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ రైతులకు సూచించారు. మండలంలోని తుడిలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వీటిపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకంలో పేర్లు తప్పైనా, విస్తీర్ణంలో తేడా వచ్చిన ఎటువంటి సమస్యలను దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డిటి జి.ప్రసాదరావు, జనసేన నాయకులు రౌతు నవీన్‌కుమార్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

సీతానగరంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్

సీతానగరం : మండలంలోని దయానిధిపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. భూ క్రయవిక్రయాలు, ఫోటీకేసులకు సంబంధించి వాటికి కూడా వినతులివ్వొచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.రామారావు, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, విఆర్ఒ, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని తహశీల్దార్ జయలక్ష్మి తెలిపారు. మండలంలోని జమ్మిడివలస, అంటివలస రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సులో గ్రామ పరిధిలోని రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించినట్లుగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడి కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి -పాలకొండ

పట్టణంలోని గారమ్మ కాలనీలో నివసిస్తున్న పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సమావేంద్ర కుమార్ పై గత ఏడాది నవంబర్‌లో ఆయన ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి వెళ్లిపోయారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు లోతైన విచారణ చేపట్టి నలుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ రాంబాబు, ఎస్ ఐ ప్రయాగమూర్తి నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టి కేసు వివరాలను అందించారు.

కక్ష పెంచుకుని

పోలీసులు ఈ కేసులో దర్యాప్తు చేపట్టి చుట్టుపక్కల వారిని విచారించి సిసి ఫుటేజ్, సెల్ ఫోన్ సిగ్నల్ ద్వారా వివరాలు సేకరించారు. నవగాం అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా పని చేస్తున్న కందివలస దుర్గప్రసాద్, పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ తనకు సెలవులకు ఇవ్వకుండా ఇబ్బంది పెడ్తున్నారని మనసులో కక్ష పెంచుకున్నారు. విజయనగరానికి చెందిన దుర్గా ప్రసాద్ అక్కడ తన స్నేహితులకు ఇదే విషయం తెలియజేసి దాడి చేయాలని పురమాయించారు. దీంతో షేక్ షాజహాన్ అనే వ్యక్తికి సమావేంద్రకుమార్‌ను చూపించి ఆయనపై వారం రోజులు రెక్కీ నిర్వహించారు. ఇంట్లో ఎఎస్‌పి ఒక్కరే ఉంటున్నారని గుర్తించి నవంబర్ 8న ఎఎస్‌పీ ఇంట్లోకి షేక్ షాజహాన్, ప్రకాష్, పూర్లి రాజు చొరబడి బలంగా దాడి చేశారు. తలుపుకు బయట నుంచి గొళ్ళెం పెట్టి దూరంగా ఉంచిన తమ వాహనాలపై అక్కడ నుంచి విజయనగరం చేరుకున్నారు.

ప్రెస్‌మీట్‌లో నిందితులను ప్రవేశపెట్టిన డీఎస్‌పి రాంబాబు

డీఎస్పీ అభినందనలు

ఈ కేసులో లోతుగా విచారణ చేపట్టి, టెక్నికల్ సహాయంతో కేసును కొలిక్కి తీసుకుని వచ్చిన పాలకొండ సిఐ చంద్రమౌళి, ఇతర పోలీసులను అభినందించారు. అలాగే ఈ కేసులో కీలకమైన వివరాలు, సాంకేతికత సహాయంతో కనిపెట్టిన కంప్యూటర్ కానిస్టేబుల్ రాజేష్‌కు నగదు పురస్కారం అందించారు.

అసాంఘిక కార్యక్రమలకు పాల్పడితే తీవ్ర చర్యలు : డిఎస్‌పి

అసాంఘిక కార్యక్రమాలకు ఎవరు పాల్పడ్డా చట్టప్రకారం తీవ్ర చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని డీఎస్పీ ఎం.రాంబాబు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుడూ సంక్రాంతి పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పేకాట, కోడిపందేలు, ఇతర అసాంఘిక కార్యక్రమలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనాచోదకులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే పండుగ సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని అన్నారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బ్యాగులు, విలువైన వస్తువులతో ప్రయాణం చేసేవారు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రయాగమూర్తి, సిబ్బంది ఉన్నారు.

సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొమరాడ

అంగన్వాడీల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని నందాపురం, డంగభద్ర, కొమరాడ యూనియన్ జెండాను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇందిర, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, అంగన్వాడీ సెక్టార్ నాయకులు జానకి, పుష్ప మాట్లాడారు. అంగన్వాడీ సెంటర్ల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్ రూ.10వేలకు పెంచాలని కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీవో అమలు చేయాలని, మట్టి ఖర్చుల జీవో అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ వర్కర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధికారులు ఫుల్... సమస్యలు నిల్

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ ఏవో బి.వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమానికి అధికారులంతా హాజరైనప్పటికీ ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకపోవడంతో అధికారులంతా సమయం పాటించి అనంతరం ఆయా కార్యాలయాలకు చేరుకున్నారు.

ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రతి ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక ఎస్ఐ రాజేష్ సూచించారు. మండలంలోని చినబోగిలి జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులందర్నీ ఆపి వారిని తప్పనిసరిగా భద్రత కోసం, వారి కుటుంబ భవిష్యత్తు కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రామినాయుడు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానికంగా ఉన్న చింతలగూడ ఎయిడెడ్, ఎలిమెంటరీ పాఠశాలను సర్పంచి బొత్తాడ గౌరీశంకర్రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. చదువులో ఏమాత్రం రాణిస్తున్నారు అనే దానిపై పలు ప్రశ్నలు వేశారు. మధ్యాహ్న భోజనం బాగున్నాయని విద్యార్థులు తెలిపారు. పాఠశాల పరిసర ప్రాంతాలు ఆహ్లాదకరంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొండవాడ సర్పంచ్ ఎం.కృష్ణారావు, ఉపాధ్యాయులు సునీత, మహిళా పోలీస్ ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

275 గ్రామాల్లో పీసా ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలో జరిగిన పీసా ఎన్నికల్లో 278 గ్రామాలకు గానూ 275 గ్రామాల్లో ఏకగ్రీవమైనట్లు పిఒ అశుతోష్ శ్రీవాస్తవ సోమవారం ఒక ప్రకటన జారీచేశారు. ఐటీడీఏ పరిధిలోని 8 పీసా మండలాల్లో ఈ నెల 2 నుంచి 6 వరకు 277 పీసా గ్రామాల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శులకు ఎన్నికలు జరగ్గా 275 గ్రామాల్లో ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు గ్రామాల్లో పీసా ఎన్నికలు జరిగినట్లు పీఒ వివరించారు.

సంతలో ప్రచారం చేస్తూ నిధులు వసూలు చేస్తున్న సిపిఎం కార్యకర్తలు

సిపిఎం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - సీతంపేట

నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలకు ప్రజలు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించి ఈ సభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.తిరుపతిరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం సీతంపేట సంతల్లోనూ, మెయిన్‌రోడ్డులో ప్రచారం చేస్తూ, పార్టీ నిధి వసూళ్లను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న పార్టీ సిపిఎం అన్నారు. జిల్లాలో మన్యం ప్రాంతంలో అనేక ప్రజా సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడిందని, వాటిని సమీక్షించుకొని రాబోయే కాలంలో అటు రాష్ట్ర అభివద్ధికి, ఇటు జిల్లా సమగ్ర అభివద్ధి లక్ష్యంతో ఆందోళన పోరాటాలకు సమాయత్తం కావాలని కోరారు. జిల్లాలోని తోటపల్లి, జంఝావతి, జంపరకోట రిజర్వాయర్లు పూర్తి, గుమ్మిడి గెడ్డపై రిజర్వాయర్ తదితర సమస్యలపై నిలకడగా పోరాడుతున్న పార్టీ సిపిఎం అని అన్నారు. రాబోయే రోజుల్లో వీటిపైన పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు ప్రజలంతా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల సిపిఎం కార్యదర్శి ఆరిక భాస్కరరావు, సర్పంచ్ సుందరమ్మ, వీరన్న సిపిఎం నాయకులు పాలక సాంబయ్య, లక్ష్మణరావు, కాంతారావు, కార్యకర్తలు పాల్గొన్నారు

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అనారోగ్య సమస్యలతో సతమతమయ్యే పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందిని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన గేదెల మంగ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.51,310 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉన్న వాళ్లకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితులకు ఆర్థిక సహాయం సిఎం సహాయ నిధి కింద అందజేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు గుండ్రెడ్డి రవి, కోల మధు, గేదెల రామారావు పాల్గొన్నారు.

గోతులను పూడ్చండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని ప్రధాన రహదారిలో పలుచోట్ల ఏర్పడిన గోతులను పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి, జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు వి.దాలి నాయుడు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేస్తారు. పట్టణంలోని రాయగడ రోడ్డు, పాత బస్టాండు, మున్సిపల్ కార్యాలయం ప్రాంతాలతో పాటు పట్టణ ఫ్లైఓవర్, బైపాస్ రోడ్డు, రాయగడ రోడ్డు లోని చెత్త డంపింగ్ యార్డ్, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో రోడ్డుకు పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని, ఆ గోతుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ రహదారిలో నిత్యం ఒడిశా, చత్తీస్గఢ్, జార్ఖండ్, తదితర రాష్ట్రాలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుందని, స్థానికులు రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని, రానున్న సంక్రాంతి పండగకు మరింత రద్దీ పెరిగే అవకాశం ఉందని అన్నారు. లారీలు గోతుల్లో దిగబడి బోల్తా పడక ముందే మరమ్మతులు చేయాలని కోరారు.

పింఛన్లు తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమి, తామర కండి, చినబోగిలిలో వికలాంగుల పెన్షన్లను శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రి బృందం సోమవారం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా వారు ప్రభుత్వం ఇస్తున్న రూ.15వేలు పెన్షన్లు మొదటి విడతగా ఆ లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి తనకు మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్లు ఫిజికల్ ఏవిధంగా ఉందని పరిశీలించారు. అనంతరం ఆ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని బృందం సభ్యులు తెలిపారు ఈ కార్యక్రమంలో సీతానగరం వైద్యాధికారి పి.ఉషారాణి, ఎస్వీ రమణ, పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, పి.తిరుపతినాయుడు, పద్మావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో పింఛన్లను పరిశీలిస్తున్న అధికారులు

పార్వతీపురంరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పింఛన్ల తనిఖీ కార్యక్రమం మండలంలోని వెంకమ్మపేటలో సోమవారం నిర్వహించారు. గ్రామంలోని దీర్ఘకాలిక రోగాలతో మంచం మీద నుంచి కదల్లేని స్థితిలో ఉన్న మజ్జి సన్యాసి అనే పింఛనుదారుని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పరిశీలనా బృందం వెళ్లి వాస్తవాలను పరిశీలించారు. అలాగే వికలాంగ పింఛన్‌దారులను కలుసుకొని అర్హత పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిహెచ్‌సి పరిధిలోని ఐదు సబ్ సెంటర్లలో పింఛను అందుకుంటున్న వికలాంగ దీర్ఘకాలిక రోగ గురుస్తులను ప్రభుత్వ నిబంధన ప్రకారం పరిశీలించి పై అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

ఆ రోడ్లు వైసిపి ప్రభుత్వంలో మంజూరైనవే

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలోని ఉపాధిహామీ చట్టం కింద గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ సిఎం రాజన్నదొర మంజూరు చేయించిన రోడ్లనే ఇప్పుడు మంత్రి సంధ్యారాణి ప్రారంభిస్తున్నారని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంజూరైన రోడ్లు కాదన్నారు. ఈ మాత్రం దానికి వందరోజుల్లో వంద రోడ్లు పూర్తి చేశామని టిడిపి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్ల పనులను ఎన్నికల కోడ్ కారణంగా తాము ప్రారంభించలేక పోయామని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా రాజన్నదొర మంజూరు చేయించిన రోడ్లలో కొన్నింటిని తాము పూర్తి చేశామని చెప్పారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో కొత్తగా మంజూరైనవి ఇవి కాదన్నారు. ఇప్పుడున్న మంత్రి సంధ్యారాణి కూడా ఈ రోడ్ల పనులు మంజూరు చేయించలేదని సురేష్ చెప్పారు. విలేకరుల సమావేశంలో సర్పంచులు జర్జాపు మోహన్, లక్ష్మణరావు, అప్పారావు, ఎంపిటిసి సభ్యులు గెమ్మెల సుబ్బారావు పాల్గొన్నారు.

లోవముత్తా పంచాయతీల్లో గ్రామసభలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవముత్తా ప్రాంతంలో గల రాయగడ జమ్ము పంచాయతీ గొరడ, బాలేసు పంచాయితీలో సోమవారం గ్రామ సభలు ఏర్పాటు చేశారు. గ్రామపంచాయితీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి)పై చర్చించి తీసుకున్న నిర్ణయాలను ఈ గ్రామసభలో ఆమోదం గూర్చి వివరించారు. 2025-26లో సాధారణ గ్రామసభ 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు అప్పగించిన 29 అంశాలపై సమీక్షలు, ప్రగతి నివేదికలు చదివి ప్రజలకు వినిపించారు. బాలేసు సర్పంచి మండంగి కళావతి మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ, భూ అభివృద్ధి పనులు, భూసార పరిరక్షణ, వాటర్ షెడ్లు, చిన్న తరహా అటవీ ఉత్పత్తులు, గ్రామాల అభివృద్ధికి సంబంధించిన విషయాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాయగడ జమ్ము, బాలేసు పంచాయతీ కార్యదర్శులు జి.వాసుదేవనాయుడు, బిడ్డిక కృష్ణారావు, విఆర్ఒలు జి.భాస్కరరావు, శంకరరావు, వార్డు మెంబర్లు, పీసా చట్టం ఉపాధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి గణపతి. తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే నాయకులు మార్పు బాలకృష్ణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో ఎపిటిఎఫ్ నాయకులు మార్పు బాలకృష్ణ వర్ధంతి సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మండల ఎపిటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పోల సత్యంనాయుడు, కొల్లి కూర్మినాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాడే నాయకుడు బాలకృష్ణ అని, సమస్య పరిష్కారమయ్యేంత వరకూ పోరాటాన్ని కొనసాగించేవారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితోనే సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.